# వాగ్దత్త

(కథానిక)

ధర్మయ్యని యిలా నడిబజారులో అకస్మాత్తుగా కలుసుకుంటాడని అనుకోలేదు రంగారావు. భుజంమీద బరువయిన చెయ్యిపడి, "రంగా!" అని అప్యాయంతో కూడిన పిలుపు వినబడేటప్పటికి ఎవరో అనుకుని తెల్లబోయాడు గాని ఆ పిలిచింది ధర్మయ్య అయివుంటాడని కొంచెమైనా అనుకోలేదు తను.

తెల్లబోతూ బిడియంగా ధర్మయ్య ముఖంలోకి చూశాడు. నాలుగేళ్ళ క్రితం ఎలా వున్నాడో అలానే వున్నాడు. ఆ ముతక ఖద్దరు పంచా, చొక్కా—వేషధారణలోకూడా ఏమీ మార్పు కనిపించలేదు. పెదిమలమీద చిరునవ్వు తొణికిసలాడుతూ వుంది.

"అలా చూస్తావేం రంగా! నన్ను గుర్తుపట్టలేదా?" అని అడిగాడు ధర్మయ్య చిరునవ్వు పెదవులమీద నాట్యం చేస్తూవుండగా.

తనను యీ హోదాలో, యీ వయసులో ఎవరూ సాహసించి 'రంగా' అని పిలువలేరు, ఆ ధైర్యం చనువు ఒక్క ధర్మయ్యకే చెల్లాయి.

"గుర్తున్నావు" అనిమాత్రం అనగలిగాడు రంగారావు. ధర్మయ్యపట్ల తను చేసిన అపరాధం జ్ఞప్తికి వచ్చి వళ్ళంతా సిగ్గుతెరలు కమ్మాయి. ఏ ముఖం పెట్టుకుని అతనితో మాట్లాడుతాడు యింక?

అసలు ధర్మయ్యను తను కలుసుకోవటం జరిగివుండేది కాదు. తన కారు సర్వీసింగుకు పోయి వుండటంవల్ల, బండిలో పోదామని అనిపించినా ఎందుచేతనో నడుద్దామని బుద్ధి పుట్టటంవల్ల అతన్ని కలుసుకోవటం సంభవించింది. తనకు అవసరమయిన పని వుండటం వలన యిప్పుడు బయటకు వచ్చాడు. లేకపోతే అదికూడా జరిగి వుండేది కాదు.

"ఏమిటి? ఈ వూళ్ళో వుంటున్నావా?"

"అవును. చాలాకాలం క్రిందటనే యిక్కడికి ట్రాన్స్‌ఫర్ చేశారు"

"కాని నువ్వు బలేపని చేశావ్ రంగా?" ధర్మయ్య అన్నాడు. "ఇన్నాళ్ళూ నీ అచూకీ నాకు తెలియకుండా దొంగలా ప్రవర్తించావ్."

రంగారావు జవాబు చెప్పలేక తల వంచుకున్నాడు. ధర్మయ్య అతనివంక తిరిగి రోడ్డుమీద యెందుకు? యింటికి పోతున్నావా? పద పోదాం" అన్నాడు. రంగారావు తల ఎత్తి అయినా చూడకుండా నడక సాగించాడు. ధర్మయ్య ఏవో ఆలోచిస్తూ అతని ప్రక్కనే నడవ సాగాడు.

రంగారావు మనస్సులో ఆలోచనలు గిర్రున తిరుగసాగాయి.

* * *

తను పల్లెటూళ్ళో పుట్టాడు. చాలాకాలం పల్లెటూళ్ళోనే పెరిగాడు. పదేళ్ళ వయస్సులో వుండగా ధర్మయ్యతో స్నేహం కలిసింది. అప్పట్నుంచీ యిద్దరూ ఒకటిగా పెనవేసుకొని పోయారు. చెట్టాపట్టీలు వేసుకుని యిద్దరూ బడికి పోతుంటే చూసేవాళ్లు అన్నదమ్ములేమోనని భ్రమ పడేవారు.

మొదట్నుంచీ తాము కొంచెం వున్నవాళ్లు, పెద్దలనాటినుంచీ దర్జాగా, గౌరవ మర్యాదలతో గడిపిన వంశం తమది. ధర్మయ్య కుటుంబము కూడా గౌరవ మర్యాదలుకలదే వాడూ కొంత డబ్బున్నవారేగాని ఎక్కువగా కాదు.

రోజులు గడుస్తున్నకొద్దీ తమ స్నేహం బాగా అల్లుకుపోయింది. నిజానికి తన కోతదారి తనానికీ, ధర్మయ్యను అన్న సూటిపోటి మాటలకీ యిద్దరికీ ఎన్నోసార్లు స్నేహం తెగిపోవల్సింది. కాని ధర్మయ్య ఎటువంటి పరిస్థితుల్లోనయినా కోపం తెచ్చుకోకుండా మరు

కొమ్మూరి వేణుగోపాలరావు

క్షణంలో వచ్చి తనను "రంగా!" అని ఆప్యాయంగా పలుకరించేవాడు. దానితో ఇద్దరి మనస్సులూ అతుక్కుపోయేవి.

ఇద్దరూ గబగబా పరీక్షలు ప్యాసయ్యిపోయి ఆ బడిలో చదువు ముగించేశారు. తన యింట్లో బస్తీకి పంపి చదివిస్తానన్నారు. తనకూ పెద్ద చదువులు చదువుకోవాలనే వుంది. అందుకని చాలా సంతోషపడ్డాడు. ధర్మయ్య కూడా వస్తాడనే తన వూహ. కాని ధర్మయ్య ఇంట్లో అందుకు అంగీకరించలేదు. "చదివిన చదువు చాలు. ఇక్కడవుండి పొలం చూసుకో." అన్నారు. ధర్మయ్యకు చదువుకుందామని ఎంత వుత్సాహమున్నా యేం చేస్తాడు? ఇద్దరూ విడిపోవలసిన సమయం వచ్చింది. విడిపోయారు.

ఎడబాటు కలిగేముందు ధర్మయ్య ఎంతగానో విచారించాడు. "నా చదువు యీ విధంగా పరిసమాప్తి చెందింది. నువ్వయినా పెద్ద చదువులు చదివి మంచి వుద్యోగాలు సంపాదిద్దువుగానిలే" అని వీడ్కోలులోనే ఆశీర్వాదం పలికాడు.

ఆ తర్వాత యిద్దరిమధ్యా వుత్తరాలు మాత్రం నడిచేవి. తను యెప్పుడయినా సెలవులకు స్వంత వూరికి వచ్చేవాడు. ధర్మయ్య ఎరుగని కొత్త విశేషాలు యెన్నో చెప్పేవాడు. మళ్ళీ కొంతకాలం యిద్దరూ సరదాగా గడిపేవారు. సెలవులు పూర్తయిన తర్వాత తను బస్తీకి వెళ్ళిపోయేవాడు.

చాలా రోజులు గడిచాయి. ధర్మయ్య పల్లెటూళ్ళోనే వుండిపోయాడు. తను కాలేజీ చదువు ముగించేశాడు. తర్వాత తన తండ్రి యింజనీరింగు కోర్సు చదవమని సలహా ఇచ్చాడు. దానితో తను యింకా దూర ప్రాంతానికి వెళ్లిపోవలసి వచ్చింది.

ఇంజనీరింగు చదువుతుంటే ధర్మయ్య పెళ్లి అయిందని తెలిసింది. తెలియటమేమిటి తప్పకుండా రావాలని స్నేహితుడిదగ్గరనుంచి వుత్తరాలు వచ్చాయి. కాని తన పరీక్షలు సమీపిస్తూ వుండటంచేత వెళ్లలేకపోయాడు. తన చదువు సంపూర్తి అయినతర్వాత స్వంత వూరికి వచ్చాడు. ధర్మయ్య తనని తీసుకుపోయి అతని భార్యను చూపించాడు. తను విస్తుపోయాడు. ధర్మయ్య ఒక పల్లెటూరు పిల్లని పెళ్ళి చేసుకుంటాడని వూహించుకోలేదు. కాని వెంటనే గుర్తు వచ్చింది. అతను కూడా పల్లెటూరివాడేగా. అతనేం బస్తీలకి పోయి చదువుకోలేదుగా. అమాయకత్వమంతా ధర్మయ్య భార్య ముఖంలోనే యిమిడివున్నదా అనిపించింది.

ధర్మయ్య వేషధారణలో మార్పేమీ లేదు. ఎప్పటివలనే ముతక పంచా, చొక్కా. తను మాత్రం ప్రతి విషయంలోనూ నాగరికత అలవరచుకున్నాడు.

తర్వాత కొద్ది రోజులకే తను గ్రామాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోవలసి వచ్చింది వుద్యోగరీత్యా. ఒక చదువుకున్న అమ్మాయితో తన పెళ్ళిజరిగింది. ధర్మయ్య భార్యతో సహా తన పెళ్లికి వచ్చాడు.

ప్రైవేటు వృత్తి కానందువల్ల తరుచు వూళ్లు మారవలసివచ్చింది. మారుతున్నాడు. ఒకసారి ధర్మయ్యకు కొడుకు పుట్టాడని వుత్తరం వచ్చింది. పదకొండో రోజు పండక్కి రమ్మనమని ఆహ్వానం కూడా వచ్చింది. తను వెళ్లలేదు వెళ్ళేందుకు యిదేమయినా చెప్పుకోతగ్గ శుభకార్యం అయితేగా.

ధర్మయ్య మామూలుగా వుత్తరాలు రాస్తున్నాడు. తనూ రాస్తూనే వున్నాడు. కాలం చకచకా గడచిపోతోంది. ఎన్నో పరిణామాలు జరిగాయి జీవితంలో. తన తండ్రికూడా ఆ రోజుల్లోనే చనిపోయాడు.

చాలా రోజులు గడిచాక తనకు కుమార్తె జన్మించింది. పదకొండో రోజు పండుగ చాలా ఘనంగా జరపాలన్నది భార్య. 'అవును' అన్నాడు. అందరకూ ఆహ్వానాలు వెళ్ళాయి. ధర్మయ్యకూ ఆహ్వానం పంపాడు.

అనుకున్న వేళకి ధర్మయ్య భార్యతోనూ, కొడుకుతోనూ వచ్చాడు తనకుమార్తెకు నామకరణం జరిగింది. "గిరిజ" అని పేరు పెట్టుకున్నారు ముద్దుగా.

ఆ రాత్రి భోజనాలు అయింతర్వాత తమందరూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. ఏదో మాటల్లో ధర్మయ్య అన్నాడు "చూశావా రంగా! పిల్లలిద్దరికీ యీడూ జోడూ

ఎలా కుదిరిందో, మన మిద్దరం వియ్యంకులం అయితే బాగుంటుంది కదూ" అని.

"నిజమే. కాని యిప్పటిమాట కాదుగా" అన్నాడు తను.

"కాకపోయినా అసలు యిలా జరగటం నీకు సమ్మతమైన విషయమేనా?" అన్నాడు ధర్మయ్య తిరిగి.

"సంతోషంగా"

"అయితే నే నీమాటను వాగ్దానంగా తీసు కుంటున్నాను సుమా. ఎప్పటికయినా గిరిజ నాకోడలు కావాలి."

ధర్మయ్య పల్లెటూరితనానికి తనకు నవ్వు వచ్చింది. వీళ్ళంతా పూర్వకాలపు మనుష్యులు పుట్టి పదకొండురోజులయినా కాలేదు. అప్పుడే పెళ్ళివరకూ పోయారు" అనుకుని విస్తు పోయాడు.

"అలాగే" అన్నాడు తను.

మరునాడు ధర్మయ్య వెళ్ళిపోయాడు. తన భార్య తన దగ్గరకొచ్చి "నిన్న అలా ఎందు కన్నారు అతనితో?" అని అడిగింది.

ధర్మయ్యతో తను అన్నమాటలు గుర్తుకు వచ్చి "ఏదో యథాలాపంగా, అన్న మాటలు పట్టింపుగా తీసుకుంటావేమిటి? అనగానే అయి పోయిందా?" అన్నాడు.

"యథాలాపంగా అన్నా అటువంటి మాటలు ఎందుకని? అత నామాటలు నిజంగా తీసుకుంటే?" అని రెట్టించింది ఆమె.

ఆమె దూరదృష్టికి తను నవ్వుకుని "ఎప్పటి మాటలో యిప్పటినుంచీ ఎందుకు? ఒక చిన్న విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకుంటా వేం?" అని మందలించాడు, ఆమె యిక మాట్లాడలేదు.

ధర్మయ్య వూరికి వెళ్ళిపోయినాగాని ఎప్ప టిపలెనే వుత్తరాలు రాస్తూనే వున్నాడు. రోజులు గడుస్తున్న కొద్ది గిరిజ పెరిగి పెద్దదవ సాగింది. ఆమెను స్కూల్లో ప్రవేశపెట్టాడు తను.

గిరిజ స్కూలుఫైనల్ ప్యాసయి కాలేజీలో అడుగు పెట్టిన తర్వాత ధర్మయ్య తన కొడు కుని మెడికల్ కాలేజీలో చేర్పించానని వుత్తరం రాశాడు, పరిస్థితుల ఒత్తిడివలన అతను చదువుకోనకపోయినా కొడుకుని బాగానే చది విస్తున్నాడని సంతోషించాడు తను.

ధర్మయ్య తనను ఎప్పుడయినా కలుసుకోవ టం సంభవించినపుడు తమ పిల్లల వివాహాన్ని గురించి ప్రస్తావిస్తూనే వున్నాడు. నిజానికి ఆ సంబంధం చేసుకోవటం తనకు యిష్టంలేదు. తన కుమార్తెకు యింకా మంచి సంబంధం తీసుకు రావాలని తన అభిప్రాయం. కాని ఆ విష యాన్ని నిష్కర్షగా స్నేహితుడితో చెప్పలేక "యింకా కొన్నాళ్ళు పోనిద్దూ" అని తప్పించు కునేవాడు.

సరిగ్గా నాలుగేళ్ళక్రితం అక్కడినుంచి ట్రాన్స్‌ఫర్ అయి వచ్చేశాడు యీ వూరికి. అమ్మాయికి పెళ్ళి యీడు వచ్చిందని భార్య పోరు పెట్టసాగింది. సరే, తను సంబం ధాలు అన్వేషించటంలో మునిగి పోయాడు. ఒకప్పుడు ధర్మయ్యకు వాగ్దానం చేశానని కూడా గుర్తురాలేదు యీ సమయంలో.

ధర్మయ్యకు తను యిక్కడ వుంటునట్లు తెలీదు. ఇక్కడికివచ్చిన తర్వాత అతనికి తను వుత్తరాలు రాయలేదు.

చివరికి తన కోరిక నెరవేరింది. ఒక లక్షాధి కారి కుమారుడిని అల్లుడిగా చేసుకోటానికి నిశ్చయించుకున్నాడు. వివాహం జరిగిపోయింది. పెళ్ళికి ధర్మయ్యని పిలవటానికి సాహసించలేక పోయాడు. తనపై ఎటువంటి నింద వేస్తాడోనని భయం.

మంచి అల్లుడిని తెచ్చుకున్నామని ముచ్చట పడ్డారు. కాని అది మూన్నాళ్ళ ముచ్చటే అయింది. అల్లుడు సంసారసాగరంలో అడుగు పెట్టకుండానే టైఫాయిడ్ జ్వరానికి బలిఅయి పోయాడు.

ఇప్పుడేం జరిగింది? ధర్మయ్య నిలబెట్టుకో మన్నమాట తను ఎందుకని నిలబెట్టుకోలేదు? ధర్మయ్య తన ఆత్మసాక్షిగా అన్నమాటలను తను వాగ్దానంగా ఎందుకని తీసుకోలేదు? ఏమ యిందిప్పుడు? గిరిజ వితంతువయింది.

ధర్మయ్య కొడుకుని అల్లుడిగా చేసుకుంటే ఎలా జరిగివుండేదో? ఈ విషయం ధర్మయ్యకు వుత్తరంరాసి క్షమాపణలు కోరుకుందామా?

అనిపించింది. కాని అందుకు కూడా సాహసించ లేకపోయాడు.

ఆశ్చర్యం! దేశంలో నాగరికత అభివృద్ధి చెందుతూవుంది రోజురోజుకీ. ఎన్నో వితంతు వివాహాలు జరుగుతున్నాయి. తనకుమార్తె పునర్వివాహం కోసం ప్రయత్నిస్తే అది నెరవేరదేం?

అప్పట్నుంచీ గిరిజ యింట్లోనే ఉంటున్నది. మామూలు మనిషిగా కాకుండా. అయినా వుండక యింకెక్కడికిపోతుంది?

నడుస్తున్నారు యిద్దరూ. ఎవరూ మాట్లాడటంలేదు. అసలు విషయంచెప్పి క్షమాపణ కోరుకుందామా? అనుకుంటున్నాడు రంగారావు. ధైర్యం చాలటంలేదు.

* * *

రామానికి పెళ్లయి ఎన్నేళ్ళయిందో? ఎంత మంది పిల్లలో!

"ఇదేయిల్లు" అని ఒక మేడ ముందు ఆపి ధర్మయ్యనులోపలికితీసుకుపోయాడురంగారావు. ముందుగదిలో ఒక యిర్వై యేళ్ళ అమ్మాయి ఏదో పుస్తకంచదువుకుంటూ వీళ్ళిద్దరూ రాగానే లేచి నిల్చుంది. ఆ అమ్మాయివంక పరిశీలనగా చూసి ధర్మయ్య "ఏమిటి? గిరిజేనా? ఎంత మారిపోయింది!" అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"అవును" అని రంగారావు కుమార్తెవంక తిరిగి "ఇతను నా స్నేహితుడు ధర్మయ్య లేవమ్మా నువ్వితన్ని చూసి చాలాఏళ్లయింది. ముందు కాఫీ తీసుకురా" అన్నాడు. గిరిజ లోపలికి వెళ్ళిపోయింది.

"కూర్చో" అన్నాడు రంగారావు. ఇద్దరూ కూర్చున్నారు.

రంగారావుకి ఏం మాట్లాడేందుకూ తోచలేదు. చివరికి "మీ రామానికి పెళ్ళయిందా? అతనేంచేస్తున్నాడు ఇప్పుడు?" అని అడిగాడు.

ధర్మయ్య స్నేహితుడి ముఖంలోకి వింతగా చూసి "వాడి పెళ్లి ఎలా అవుతుంది? గిరిజను నా కోడలుగా చేసుకుందామనుకున్నాను. కాని నీ అచూకీనే తెలియలేదు యిన్నాళ్లూ వాడింతవరకూ బ్రహ్మచారిగానే వున్నాడు" అన్నాడు. రంగారావు ఆశ్చర్యానికి మేరలేకపోయింది. ఇంకో విపత్తు వచ్చి పడింది. తన కుమార్తెను చేసుకుంటానని మాట యిచ్చినందున తాము ఎక్కడ వున్నారో తెలియకపోయినా కొడుక్కి పెళ్ళి చేయకుండా ఉంచేశాడా ధర్మయ్య? ఎంత ఉదార స్వభావుడు!

"వాడు ఆ పల్లెటూరులోనే ప్రాక్టీసు చేసుకుంటున్నాడు. నేనే అలా చేయమన్నాను. డబ్బుకోసంఆశపడి ఎక్కడోవుండటమెందుకు? వైద్యసౌకర్యం లేకుండా అక్కడివాళ్లు బాధపడుతుంటే అలా చేయించాను."

రంగారావుమనస్సు ఎక్కడో విహరిస్తోంది. గిరిజ కాఫీ తెచ్చి బల్లమీద పెట్టి పోయింది.

"తీసుకో" అన్నాడు రంగారావు.

కాఫీ తాగుతూండగా ధర్మయ్య, "అసలు విషయం చెప్పవేం? ఎందుకలా మౌనంగా వుండిపోతున్నావు? నాకు నీ నివాసం తెలియనియ్యకుండాఎందుకు చేశావ్? గిరిజకు పెళ్లి కాకుండా ఇంతవరకూ వుంచేశావేం?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

ఎంత అమాయకుడు ధర్మయ్య! తన కొడుక్కి యిచ్చి పెళ్లి చేయకపోతే ఆమెకు యింకా పెళ్లి కాలేదనే అనుకుంటున్నాడా!

ఎట్లాగో కూడదీసుకుని అన్నాడు రంగారావు, "నన్ను క్షమించు ధర్మయ్యా! నిన్ను మోసం చేశాను. మా గిరిజకు యెప్పుడో పెళ్ళి చేశేశాను. అది నీకు తెలియచెప్పటానికిబిడియపడి నేను ఎక్కడ వుంటున్నానో నీకు రాయలేదు."

ధర్మయ్య ఆశ్చర్యంగా వింటున్నాడు.

"కాని దాని భర్త చనిపోయాడు - పెళ్లి అయిన కొద్దిరోజులకే."

"ఎంతపని చేశావ్ రంగా? ఆమె పెళ్లి నాతో చెప్పకుండా చేశావా?" అన్నాడు ధర్మయ్య ఆశ్చర్యంతో.

"పోనీ చేశావు. ఆమెను వితంతువుగా ఎందుకు వుంచావు? తిరిగి పెళ్ళి చేయకుండా ఆమె జీవితాన్ని నాశనం చేద్దామనుకుంటున్నావా?"

రంగారావు తలఎత్తి దీనంగా చూసి "ప్రయత్నం చేశాను. లాభంలేక పోయింది" అన్నాడు.

"ఇప్పుడయినా ఆ సంగతి నాకు ఎందుకని

రాయలేదు? నేను చచ్చిపోయాననే భావించావా? యెప్పుడో ఇద్దరం వియ్యకులం అవుదామని అనుకున్నాము. ప్రమాదవశాత్తూ అది అప్పుడు ఫలించలేకపోయినా నేటికి నెరవేరే సమయం వచ్చింది. గిరిజ నా కోడలు. ఈ మాటను యెవరూ కాదనలేరు" అన్నాడు ధర్మయ్య కళ్లు ప్రకాశవంతంగా మెరిసిపోతూండగా.

రంగారావు ఆశ్చర్యానికి మేరలేకపోయింది. పల్లెటూరి ధర్మయ్యేనా మాట్లాడుతూంది? ధర్మయ్యలాంటి మనుషులు యింకా యీ లోకంలో ఉన్నారా?

అతని కళ్ళనుండి ఆనందాశ్రువులు జారి పడ్డాయి.

# త్రిశంకు నరకం

"పూషా"

ఎందరెందరో స్వర్గం స్వర్గం
స్వర్గం అన్నారు.
పుర్రెకొక బుద్ధి! జిహ్వకొక రుచి!
మనిషి మనిషికీ తలవొక స్వర్గం!
పెద్దలో మొద్దులో అన్నారు
దేవుని ప్రతిబింబం మానవుడని!
మానవ ప్రతిబింబమే దేవుడని
మొన్నటి థింకర్ వొకడన్నాడు!
అదీ యిదీ కూడా కాదంటూ
సైతాన్ ప్రతిబింబమె మానవుడో
మానవ ప్రతిబింబం సైతానో
అంటూ — కాదనే వెవరంటూ!
శంకరుడొకడూ గౌతముడొకడూ
ముండిత మస్తకులై అన్నారు.
"లోకం శోకమయం సమస్తం
సర్వం దుఃఖం ఖల్విదం జగత్."
ముందో వెనకో తెలియని అటు
స్వర్గం అనేది లేనే లేదు.
ముందో వెనకో తెలియని యిటు
నరకం లేదన — గుండెలే లేదు!
ముందూ వెనకా కాని మధ్య
అంతా నరకం! చింతా నరకం!
శుశంక నరకం! త్రిశంకు నరకం!
కావాలిప్పుడు త్రిశంకునరకం!
రావాలిప్పుడు త్రిశంకు నరకం!
ఘనీభవించిన నారక తమస్సు
గభీరగర్భం నవనవ కాంతులు
ప్రజ్వాల్లగా రావాలిప్పుడు
రావాలిప్పుడు త్రిశంకు నరకం!
పదిహేనువందల యెనభయి నాటి
పేరిసు నగరపు బజారు వీధులు
వీధుల ప్రిడెయి లేజ్ తీరాలందు
పిల్లాజెల్లా తట్టాబుట్టా
వీపున వేసుక మహామహా ప్రజ!
కడుపులో కాళ్లు కళ్లల్లో నీళ్లు!
బయళ్లు బయళ్లు యెండిన బయళ్లు!
ఎండి ఎండి వ్యాపించిన పెద్ద్ద పెద్ద్ద
బయళ్లు!
బయళ్ల నడుమని రయిలుదారిపై
మెయిళ్లుమాదిరి మహాప్రజ!
పిండారీలో మరాఠిజనులో
పితృదేవతల పొలాల గనులో
అడవుల కొండల నగుల చీకటుల
మహామహామహామహామహా ప్రజ!
కళ్లల్లో నిప్పులు కురవాలీ!
వొళ్లువిరిచి పైపైకి లేవాలీ!
ప్రళయ ప్రభంజనావేగంతో
అమావాస్య తమస్సాగర తరంగ
పటలోద్వేగంతో
విరుచుకు పడాలి!
ఎందుకు ... ఎందుకో? ... కావాలి.
త్రిశంకునరకం! పధారణాల త్రిశంకునరకం
"లుక్ ఫర్ ఎనీథింగ్ బెయిన్
హోల్లీ ఆన్ ది గ్రేవ్!"